ఘనంగా విజయదశమి వేడుకలు

- పూజల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

సాక్షి నెట్‌వర్క్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. పండుగ సందర్భంగా ప్రజలు శమీ వృక్ష దర్శనం కోసం పోటెత్తారు. శమీ పత్రిని మిత్రులు, పెద్దలకు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా భావించే పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు. పలు గ్రామాల్లో ఎండ్లబండ్లు, వాహనాలను సవారీ చేయించారు.

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కుటుంబ సభ్యులతో కలసి మంత్రి స్వగృహంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాహనాలకు, ఆయుధాలకు పూజలు చేపట్టారు. సాయంత్రం శత్రువులపై విజయం సాధించినందుకు శుభసూచికగా జమ్మి చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. పిల్లలు జమ్మి పత్రిని పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకున్నారు.


కళ్యాణదుర్గం: స్వగృహంలో వాహనాలు, ఆయుధాలకు పూజలు చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దంపతులు


రాయదుర్గం టౌన్: బన్నీ మహంకాళి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కుటుంబసభ్యులు

ప్రజలందరికీ మంచి జరగాలి

రాయదుర్గంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మ వారిని వేడుకున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన బన్నీ మహంకాళి ఆలయంలో కుటుంబ సభ్యులు సతీమణి కాపు భారతి, కుమార్తె స్రవంతి, కోడలు లేఖ్యారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి విప్ పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి హాజరై మహంకాళి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శమీపత్రిని అందజేశారు.


రాయదుర్గం పట్టణంలో శమీవృక్ష దర్శనానికి ఊరేగింపుగా తరలివస్తున్న దేవతామూర్తులు


బొమ్మనహాళ్: జమ్మి చెట్టుకు ప్రదక్షిణలు చేస్తున్న చిన్నారులు


కణేకల్లులో చిక్కణ్ణేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం


వజ్రకరూరు: శమీవృక్షానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో జమ్మిచెట్టు చుట్టూ వాహనాలు తిప్పుతున్న భక్తులు


కుందుర్పి: ప్రత్యేక అలంకరణలో నాగేపల్లి యల్లమ్మ


రాయదుర్గం పట్టణంలోని బన్నీ మహంకాళి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు


కూడేరు: పూజలందుకుంటున్న గొల్లపల్లి సుంకులమ్మ


కంబదూరులో జంబుసవారీ నిర్వహిస్తున్న దృశ్యం


బెళుగుప్ప మండలం రామసాగరం వద్ద శమీవృక్షానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గుమ్మఘట్ట మండలం కోనాపురం గ్రామంలో స్వామి వారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు


కూడేరు: నేసే కుల సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహం ఊరేగింపు

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

కణేకల్లు: మండలంలోని ఆదిగానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మెకానిక్ వెంకటేశులు కుటుంబానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి పంపిణీ చేశారు. వెంకటేశులు గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మృతుని కుటుంబానికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి చెక్కును మృతుడి భార్య రేవతికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మాజీ సర్పంచు వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి ఈ-వేలం


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు

ఉరవకొండ: శిథిలావస్థకు చేరిన స్థానిక పోలీస్ కార్టర్స్ ధ్వంసం చేసి నూతన క్వార్టర్స్ నిర్మాణానికి ఈ-వేలం ప్రారంభించినట్లు అడిషనల్ ఎస్పీ హనుమంతు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం ఉరవకొండ అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్ల వెనుక వైపు ఖాళీగా ఉన్న నాలుగు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అర్బన్, రూరల్ సీఐలు హరినాథ్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామితో కలిసి అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గతంలో ఇక్కడ నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు. వీటిని ధ్వంసం చేసి నూతన క్వార్టర్స్ నిర్మాణానికి ఈ-వేలం ప్రారంభించామన్నారు. ఈ-వేలం పూర్తి అయిన వెంటనే నూతన క్వార్టర్స్‌ను నిర్మిస్తామన్నారు.

పరామర్శ


నాగిరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నాగిరెడ్డి కుమార్తె మాధవి ఇటీవల మృతి చెందింది.విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మంగళవారం నాగిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాధవి మరణం బాధాకరమన్నారు. ఆయన వెంట బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ హనుమంతరెడ్డి, కమ్మూరు సర్పంచ్ రంగారెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

యువత భక్తి మార్గంలో నడవాలి


ఆధ్యాత్మిక సందేశమిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ కిష్టఫర్

కంబదూరు: యువత భక్తి మార్గంలో నడవాలని రెవరెండు శ్యాముయేల్ శ్రీనివాసు,అనంతపురం సీఎస్ఐ చర్చ్ యూత్ కార్యదర్శి శ్యాంస్వరూప్, విశ్రాంత ప్రిన్సిపాల్ కిష్టఫర్ ఉపదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఆండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఒక రోజు యౌవనస్తుల కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి బైబిల్‌లోని ఆధ్యాత్మిక సందేశాన్ని బోధించారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సంఘ పెద్దలు దినకర్, జాన్‌శాస్త్రి, ,ప్రభుదాసు, ఎస్.పాల్,విజయ్‌కుమార్, జకరయ్య, జాకోబ్ పాల్గొన్నారు.

రేపు వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

బ్రహ్మసముద్రం: మండలంలోని గొంచిరెడ్డిపల్లిలో గురువారం వాల్మీకి మహర్షి విగ్రహం ప్రతిష్ఠించనున్నట్లు వాల్మీకి కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంవ్యాప్తంగా ఉన్న వాల్మీకి సంఘం నాయకులు, పెద్దలు, ఉద్యోగులు తరలివచ్చి ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అభివృద్ధి, సంక్షేమ బాటలో 'దుర్గం'


సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో నియోజకవర్గంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేసి ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లోని బన్నీ మహంకాళి ఆలయం సమీపంలో ఎమ్మెల్యే నిధులతోపాటు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద మంజూరైన రూ.21.40 లక్షలతో ఇటీవల నిర్మించిన మూడు నూతన సీసీ రోడ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వార్డు కౌన్సిలర్ తాడూరు భాగ్య, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులుతో కలసి విప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ సంక్షేమంతోపాటు అభివృద్ధి జరుగుతోందన్నారు. గడపగడపలో వచ్చిన సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామన్నారు. దశలవారీగా అవసరమైన చోట రోడ్లు, సీసీ డ్రైన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐదేళ్ల మంత్రి ముసుగులో ప్రజా సమస్యలకు పాతరేసి కోట్లకు కొల్లగొట్టిన ఘనుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. మంత్రిగా ఉన్నప్పుడుచేయని అభివృద్ధిని చేసినట్లు సెల్ఫీ డబ్బాలతో కాలం వెళ్లదీస్తుండడం ఆయన చేతగానితనానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ గల్లంతుకావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవింద రాజులు, శ్రీనివాసరెడ్డి, పైతోటసంజీవప్ప, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నజీర్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకుడు నాగప్ప, వైఎస్సార్‌సీపీ నేత, కాంట్రాక్ట్ నేత్రపల్లి కాంతారెడ్డి, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివకుమార్, కృష్ణమూర్తి, గోల్డ్ ఇస్మాయిల్, నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్, గోరంట్ల సత్యనారాయణ, రాము, మాజీ కౌన్సిలర్లు రఘురాం, పవన్ కుమార్, కొలిమిఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి క్షేత్రంలో మంత్రి


శృంగేరిలోని శారదాంబ దేవిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న మంత్రి

కళ్యాణదుర్గం రూరల్: విజయదశమి సందర్భంగా మంగళవారం ధర్మస్థలంలోని మంజునాథ స్వామి, హోరనాడులోని అన్నపూర్ణేశ్వరి దేవి, శృంగేరిలోని శారదాంబదేవిని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషలతో ఉండాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని మంత్రి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజరాజేశ్వరిగా అమ్మవారు


రాజరాజేశ్వరిగా జగదీశ్వరీ అమ్మవారు


ఉరగాద్రి చౌడేశ్వరి

ఉరవకొండ: దసరాశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా విజయదశమిని పురస్కరించుకుని సోమవారం ఉరవకొండ పట్టణంలోని జగదీశ్వరీ, ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరీగా భక్తులకు దర్శనమిచ్చారు. జగదీశ్వరీ ఆలయంలో ధర్మకర్త గాజుల శ్యామల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలతో పాటు గోపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టణంలో వైభవంగా ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్త కొత్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



ఆంజనేయస్వామి, రాజరాజేశ్వరిస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో విదయదశమి ని పురస్కరించుకుని మంగళవారం ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన, ఆకుపూజ గావించి ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మహామంగళహారతి, అన్నదానం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి పరిసర గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ర్యక్రమంలో సర్పంచ్ కాపు ఊలెమ్మ, వైస్ సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ శ్యామల, చంద్రశేఖర్ రెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు రామప్ప, ఆంజనేయులు, లక్ష్మీపతి, బోయ ఆంజనేయులు, మల్లేశి, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవి రథోత్సవం

రాయదుర్గం మండలంలోని బొమ్మక్కపల్లిలో రాజరాజేశ్వరీదేవి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన గావించి ఆకుపూజ చేసి, వివిధ పూలతో అలంకరణ గావించి పూజలు నిర్వహించినట్లు అర్చకుడు చంద్ర తెలిపారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహం, కలశాన్ని రథంలో కొలువుదీర్చి, భక్తజనసందోహం మధ్య రథాన్ని లాగి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీలు లక్ష్మి, అరుణ్‌కుమార్, నాయకులు శ్యాం, శివారెడ్డి, రామాంజనేయులు, రామన్న, భీమప్ప, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


అమ్మవారి కలశాన్ని తీసుకెళ్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

పూర్తయిన పైపులైన్ మరమ్మతులు

కణేకల్లు: కణేకల్లు–కణేకల్లుక్రాస్ రోడ్డుమార్గమధ్యంలో హెచ్చెల్సీ కాలువ వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. కణేకల్లులోని రామనగర్ వద్ద ఉన్న హెచ్చెల్సీ కాలువ పక్కనే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీ అయి నీరంతా వృథా అయ్యేవి. పైప్‌లైన్ లీకేజీతో ఆర్‌అండ్‌బీ మెయిన్‌రోడ్డులో గుంతలు పడి బస్సులు, లారీలతోపాటు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకలు ఏర్పడుతుండటంతో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పందించారు. గత వారం కణేకల్లు పర్యటనకొచ్చిన విప్ కాపు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూశారు. మీకెన్నీ పనులున్నా.. తక్షణమే పైప్‌లైన్ లీకేజ్ పనులు చేయాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అధికారులకు విప్ కాపు ఆదేశించారు. దీంతో అధికారులు జేసీబీతో తవ్వి రంధ్రాలు పడిన పెద్దపెద్ద పైపులు తొలగించి వాటి స్థానంలో కొత్తపైపులు వేశారు. పలుచోట్ల చిన్న, చిన్న రంధ్రాలు పడటంతో వాటికి వెల్డింగ్ చేశారు. ఐదు రోజుల పాటు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం సిబ్బంది శ్రమించి పనులను పూర్తి చేశారు. కాపు చొరవతో పైప్‌లైన్ మరమ్మత్తు పనులు జరగడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాపు స్పందించి పనులు చేయించడంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


హెచ్చెల్సీ కాలువ వద్ద మెయిన్ రోడ్డు తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేసిన సిబ్బంది

సత్ప్రవర్తనతో మెలగండి


మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

కూడేరు: ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన కూడేరు పోలీసు స్టేషన్‌ను సందర్శించి మండలవ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లకు స్టేషన్‌కు పిలుపుంచుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో గొడవలకు కారణమైతే ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అందరూ స్నేహ పూర్వకంగా కలిసి మెలసి జీవిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కుందుర్పి: పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఉదయం కుందుర్పి, కంబదూరు మండలాల్లో దాడులు నిర్వహించి పేకాట నిర్వహిస్తున్న 10 మందిని అరెస్టు చేశారు.

పేదలకు భరోసా 'వైఎస్సార్ బీమా'

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు బాసటగా నిలుస్తోందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో విష్ణు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ ఆర్థికసాయాన్ని కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులుతో కలసి మంగళవారం ఆమె అందజేశారు బీమా కింద మిగతా రూ.90 వేలు నామిని ఖాతాకు త్వరలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫకృద్దీన్, వార్డు ఇన్‌చార్జ్ నిజాముద్దీన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామంలో గాజుల నరసింహులు (43) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ హేమక్క వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద 10 వేల రూపాయల నగదును బాధితుడి కుటుంబసభ్యులకు అందించారు. మిగిలిన మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మహంతేష్, నాయకులు సురేశ్ పాల్గొన్నారు.

వైభవంగా నీలకంఠేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం


నీలకంఠేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక కామన్న కట్ట వద్ద వెలసిన నీలకంఠేశ్వరస్వామి పల్లకీ ఉత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి అర్చక అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం కాత్యాయని సమేత నీలకంఠేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన పల్లకీలో స్వామి ఉత్సవ మూర్తిని ఉంచి పట్టణంలో వైభవంగా ఊరేగించారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులు పెద్దఎత్తున క్యూ కట్టారు. కార్యక్రమంలో అర్చక అభివృద్ధి ట్రస్ట్ సభ్యులు మఠం ధనంజయస్వామి, రమేష్‌కుమార్, మఠం ప్రకాష్, మల్లికార్జునస్వామి, గంగాధర్‌స్వామి, పర్వతయ్యస్వామి, సురేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఉరవకొండ: మండలంలోని చిన్నమూస్టురు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు.. ఉరవకొండకు చెందిన రవీంద్ర, గోపాల్ పెన్నహోబిలంలో దైవదర్శనం చేసుకుని నింబగల్లుకు వెళుతుండగా చిన్నముస్టూరు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు.

ఎలుగుబంట్ల సంచారంతో బెంబేలు

కుందుర్పి: మండలంలోని కుందుర్పి, జంబుగుంపల పంచాయతీ పరిసర గ్రామాల్లో పక్షం రోజులుగా ఎలుగుబంట్ల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడగానే ఎలుగుబంట్లు గ్రామ పరిసర ప్రాంతాలు, పంట పొలాల్లో సంచరిస్తూ రైతులు, పాదచారులపై దాడులు చేస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. జంబుగుంపల సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో ఎలుగుబంట్ల సంచారం అధికమైందని, రాత్రిళ్లు బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని స్థానికులు ఓబన్న, రామాంజి, నాగరాజు తదితరులు వాపోయారు. అటవీశాఖ అధికారులు ఎలుగుబంట్లను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.